
ఈనాడు
నిర్మల్
బుధవారం అక్టోబరు 23, 2024

గుట్టుగా.. బెట్టింగ్..!



● పట్టుబడుతున్నా.. కొనసాగిస్తున్నారు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: తక్కువ పెట్టుబడికి అధిక లాభాలను ఆశగా చూపిస్తూ, పిరమిడ్ తరహాలో సభ్యులను చేర్పిస్తూ సాగుతున్న యూబిట్ కాయిన్ వ్యవహారం ఇటీవల జిల్లాలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. కొంతకాలంగా గుట్టుగా సాగుతున్న ఈ వ్యవహారం పోలీసుల విచారణతో వెలుగుచూసింది. ప్రస్తుతం ఈడీ వరకు వెళ్లింది. ఇదేరీతిలో నిర్మల్ జిల్లాలో బెట్టింగ్ దందా సైతం పెద్దఎత్తున సాగుతున్నట్లు తెలుస్తోంది. గతేడాది జిల్లాకేంద్రంలో ఓ కేసు నమోదవగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంవత్సరం ఇదేరీతిలో గత ఏప్రిల్‌లో ఓ కేసు నమోదైంది. మొత్తం అయిదుగురు నిందితులకు ఇద్దరిని గతంలోనే అరెస్టుచేసిన పోలీసులు తాజాగా ఒకరిని అదుపులోకి తీసుకున్నారు.

క్రికెట్ ప్రధానంగా..

బెట్టింగ్ వ్యవహారం చాలావరకు క్రికెట్ ప్రధాన అంశంగా సాగుతోంది. భైంసా, నిర్మల్‌కు చెందిన కొందరు వ్యక్తులు సూత్రధారులుగా ఈ దందాను కొనసాగిస్తున్నారు. కేవలం వన్‌టైమ్ పాస్‌వర్డ్ ఆధారంగా ఆన్‌లైన్‌లో, స్మార్ట్‌ఫోన్ సహకారంతో చాలా సులభంగా నిర్వహిస్తున్నారు. ప్రతీ బాల్‌కి ఎన్ని పరుగులు వస్తాయి, వికెట్లు పడతాయా, ఎవరెన్ని రన్స్ సాధిస్తారు, ఎక్కువ వికెట్లు తీసేదెవరు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, ఏ జట్టు గెలుస్తుంది.. ఇలా ప్రతీ అంశంపైనా బెట్టింగ్ సాగుతుంది. వస్తే రెట్టింపు డబ్బులు వస్తాయి కదా అనే ఆశతో చాలామంది డబ్బులు పెడుతున్నారు. చాలావరకు నష్టపోతున్నారు. ఇదంతా గుట్టుగా సాగుతుండటం, నమ్మకంగా ఉన్నవారికి తప్ప ఇతరులకు సమాచారం ఇవ్వకపోవడంతో విషయం బయటకు రావడం లేదు. గతేడాది బెట్టింగ్‌కు పాల్పడుతున్నారన్న కారణంతో నిర్మల్‌కు చెందిన ఇద్దరు, భైంసాకు చెందిన మరో ముగ్గురిపై పట్టణ పోలీసులు కేసు నమోదుచేశారు. క్రికెట్‌తో పాటు ఇతర రకాల బెట్టింగ్ నిర్వహిస్తున్నారని గుర్తించారు.

నకిలీ నోట్ల చెలామణి?

అన్ని వ్యవహారాలు డబ్బులతో కూడినవి కావడంతో నిర్వహణ సులభతరమయ్యేందుకు, అదనపు ఆదాయం సమకూరేందుకు నకిలీ నోట్లను సైతం చెలామణి చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. గతంలో భైంసా పట్టణంలో నకిలీ నోట్ల వ్యవహారం వెలుగుచూడటం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. భైంసా, నిర్మల్ వంటి ప్రధాన పట్టణాల్లో ఎవరికీ అనుమానం రాకుండా, ఇతర వ్యాపారాల మాటున ఈ అసాంఘిక వ్యాపారాలను కొనసాగిస్తున్నారని, ఇందుకోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించుకున్నారనే వాదనలున్నాయి.


లుకౌట్ సర్క్యులర్ ఆధారంగా..

భైంసా ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కొంతకాలంగా బెట్టింగ్ దందాలో కీలకసూత్రధారిగా ఉన్నట్లు అనుమానిస్తున్నారు. నిర్మల్‌లో దాదాపు ఆరునెలల క్రితం నమోదైన బెట్టింగ్‌కేసులో ఇతడు కూడా ఓ నిందితుడే. గతంలో నమోదైన కేసులోనూ ఇతడు ఉండటం గమనార్హం. కేసు నమోదు అనంతరం పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. తాజాగా విదేశాలకు వెళ్లేందుకు హైదరాబాద్ విమానాశ్రయం వెళ్లాడు. ఇదివరకే పోలీసులు జారీచేసిన లుకౌట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ) ఆధారంగా అక్కడ ఇమిగ్రేషన్ అధికారులు అతడిని గుర్తించి ప్రయాణాన్ని అడ్డుకున్నారు. అనంతరం స్థానిక పోలీసులకు సమాచారం అందించగా, వారు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారని తెలుస్తోంది.

సోయా కొనుగోళ్ల నిలిపివేత

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: వర్షాలు, విద్యుత్తు అంతరాయం కారణంగా మండలంలోని మాటేగాం సోయా కొనుగోలు కేంద్రంను రెండు రోజులపాటు నిలిపివేస్తున్నట్లు మిర్జాపూర్ పీఏసీఎస్ అధ్యక్షుడు ఆమెడ దేవేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. రైతులు పంట ఉత్పత్తులను తీసుకురావద్దని, తదుపరి సమాచారం ఇచ్చే వరకు సహకరించాలని కోరారు.

పల్లె పోరుకు ఏర్పాట్లు



నిర్మల్, న్యూస్‌టుడే : ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల తేదీ ఎప్పుడు ప్రకటించినా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఓటరు జాబితా పూర్తి చేయడంతోపాటు పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. బ్యాలెట్ పెట్టెల మరమ్మతులు చేయించారు. ఇప్పటికే వార్డులవారీగా మ్యాపింగ్, ఓటరు జాబితా తయారీపై కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి పుస్తకాలు జిల్లా పంచాయతీ కార్యాలయంలో, ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బంది శిక్షణకు అవసరమయ్యే పుస్తకాలు, సామగ్రిని ఆర్డీవో కార్యాలయంలోని ఓ గదిలో భద్రపరిచారు.

జిల్లాలో 400 గ్రామ పంచాయతీలుండగా 3,368 వార్డులు ఉన్నాయి. ఒక్కో వార్డుకు ఒక బ్యాలెట్ పెట్టె అవసరమని గుర్తించి, అవసరమైన పెట్టెలు సిద్ధం చేస్తున్నారు. గతంలో ఉపయోగించిన బ్యాలెట్ పెట్టెలను మరమ్మతులు చేయించగా, దెబ్బతిన్న వాటికి బదులు కొత్తవి తెప్పించడానికి జిల్లా పంచాయతీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఈ నెల 24న బ్యాలెట్ ముద్రణకు టెండర్లు నిర్వహించనున్నారు.


జిల్లా పంచాయతీ కార్యాలయంలో భద్రపరిచిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తన నియమావళి పుస్తకాలు

అన్నీ సిద్ధం

ఒక్కో విడతలో ఆరు మండలాల చొప్పున మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించడానికి నివేదికలు సిద్ధం చేశారు. ఒక గ్రామంలో 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. 200 మంది ఓటర్లు ఉండే పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్, ఒక పోలింగ్ అధికారి ఉంటారు. 201 నుంచి 400 మంది ఓటర్లు ఉండే చోట ఒక ప్రిసైడింగ్, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 650 మంది ఉండే దగ్గర ఒక ప్రిసైడింగ్ ముగ్గురు పోలింగ్ అధికారులు విధులు నిర్వహించనున్నారు.

గతంలో జిల్లాలో 396 పంచాయతీలు, 3,338 వార్డులకు ఎన్నికలు జరగగా కొత్తగా ఏర్పడ్డ కుభీరు మండలం రంజనితండా, కడెం మండలం న్యాధర్మాజిపేట, తానూరు మండలం కల్యాణి, ఖానాపూర్ మండలం రంగపేట పంచాయతీల్లో 30 వార్డులు అదనంగా చేరాయి. ఈ సారి మొత్తం 400 పంచాయతీలు 3,368 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. కొత్తగా ఏర్పడ్డ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వం కులగణనకు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో పాత రిజర్వేషన్లు ఉంటాయా.. కొత్తవి చేస్తారా అనే దానిపై పోటీదారుల్లో ఆసక్తి నెలకొంది. కులగణన పూర్తి చేసిన తర్వాత గతంలోని రిజర్వేషన్లు రద్దు చేసి కొత్తగా ప్రకటించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

బాల్యవివాహాలు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

నిర్మల్, న్యూస్‌టుడే : బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పాలనాధికారి అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి బాలల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో బాల్యవివాహాల నియంత్రణ, బాలల అక్రమ రవాణా, లైంగిక వేధింపుల నివారణకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. వీటి నియంత్రణకు గ్రామ పంచాయతీల్లో తీర్మానం చేయాలన్నారు. ఆపరేషన్ ముస్కాన్, స్మైల్ వంటి కార్యక్రమాల తరహాలో బాల కార్మికుల విముక్తికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. అదనపు పాలనాధికారి(స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, డీఎస్పీ గంగారెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి, సంక్షేమశాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్

ఆయుధాలపై అవగాహన


ఖానాపూర్: ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న పోలీసులు

భైంసా, ఖానాపూర్ న్యూస్‌టుడే : ప్రజల రక్షణకు పోలీసు వ్యవస్థ నిరంతరం పనిచేస్తుందని సీఐ గోపీనాథ్ అన్నారు. మంగళవారం పట్టణ పోలీసు ఠాణాలో ఓపెన్ హౌస్ కార్యక్రమంలో సమాజం పోలీసుల పాత్ర, వారి విధులపై అవగాహన కల్పించారు. ఎలా ఫిర్యాదు చేయాలి, వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారో వివరించారు. ఆయుధాల వినియోగం, డాగ్‌స్క్వాడ్, మెటల్ డిటెక్టర్, కమాండింగ్ కంట్రోల్ గది, నిందితులను బందీ చేసి ఉంచే సెల్‌లను ప్రత్యక్షంగా చూపించారు. ఖానాపూర్ ఠాణాలో సీఐ సైదారావ్, ఎస్సై రాహుల్‌గైక్వాడ్ సమక్షంలో పోలీసు సిబ్బంది ఆయుధాల పనితీరు గురించి పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మెట్లు ఇలా.. పరిశుభ్రత ఎలా?



ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపేట్ గ్రామంలో మంచినీటి ట్యాంకును ఎక్కడానికి ఏర్పాటు చేసిన మెట్లు ప్రమాదకరంగా మారాయి. ఈ ట్యాంకు మెట్లు ఎక్కేటప్పుడు అదుపుతప్పి పడిపోకుండా ఏర్పాటు చేసిన సైడ్‌వాల్ ధ్వంసం కావడంతో ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. ట్యాంకులో క్లోరినేషన్ చేయాలన్నా, శుభ్రం చేయాలన్నా సాహసం చేయాల్సిందే. భయపడి ట్యాంకు ఎక్కేందుకు నిరాకరిస్తే గ్రామంలోని ప్రజలు అపరిశుభ్రమైన నీరు తాగి అనారోగ్యంబారిన పడాల్సిందేనని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ విషయమై ఎంపీవో రత్నాకర్ రావును సంప్రదించగా ఇప్పటికే ట్యాంకును పరిశీలించామని, ఉన్నతాధికారులకు విన్నవించి వారి ఆదేశాల మేరకు మరమ్మతులు చేపడతామన్నారు.

వృక్ష తోరణం.. చక్కని ప్రయాణం


సొరంగ మార్గాన్ని తలపిస్తున్న కనకాపూర్- లక్ష్మణచాంద రహదారి

దారి పొడవునా కిలోమీటరు మేర పందిరి వేసినట్లు అల్లుకున్న ఈ వృక్షాలు పొట్టపల్లి నుంచి లక్ష్మణచాంద మండల కేంద్రానికి వెళ్లే దారిలోనివి. మొక్కలు నాటితే అవి పెరిగి వృక్షాలుగా ఎదిగి మనకు అనేక రకాలుగా ఉపయోగపడతాయనడానికి ఇవి నిదర్శనం. గత పాలకులు హరితహారంలో భాగంగా రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలు ఎదిగి చల్లని నీడ నిస్తున్నాయి. ఈ నీడలో ప్రయాణం హాయి ఇవ్వడమే కాకుండా పచ్చని తోరణాన్ని తలపిస్తూ మంచి అనుభూతిని కలిగిస్తుందని ప్రయాణికులు చెబుతున్నారు.

\- చిత్రాలు: న్యూస్‌టుడే, నిర్మల్

నల్లని వరి.. పచ్చని మడి



ఖానాపూర్ పట్టణ శివారులోని వ్యవసాయ భూమిలో ఓ రైతు నల్ల వరి పంటను పండిస్తున్నాడు. ఆకుపచ్చని వరి పొలం పక్కన మడిలో నల్లని ధాన్యాన్ని పండించడంతో పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు. నల్ల బియ్యం ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయని కొందరు నిపుణులు చెబుతున్నారు.

\- న్యూస్‌టుడే, ఖానాపూర్ గ్రామీణం

రుచులు ఆస్వాదించేలా.. లాభాలు ఆర్జించేలా..

● ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ల ద్వారా మహిళలకు ఉపాధి



న్యూస్‌టుడే, చెన్నూరు, నస్పూర్ :

నోరూరించే మిఠాయిలు.. ఘుమఘుమలాడే పిండి వంటకాలు.. సంప్రదాయ రుచులతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో క్యాంటిన్లు ఆహ్వానం పలుకుతున్నాయి. మహిళలకు స్వయం ఉపాధి కల్పించి వారిని ఆర్థికాభివృద్ధి వైపు ప్రోత్సహించేలా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. నిర్వహణ సామర్థ్యం ఉన్న స్వయం సహాయక సంఘాలను గుర్తించి శిక్షణ ఇచ్చి వీటిని ఏర్పాటు చేస్తున్నారు. రూ.8 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు దశల వారీగా రుణాలు మంజూరు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, మంచిర్యాల కలెక్టరేట్ ప్రాంగణాల్లో, లక్షెట్టిపేటలోని ఐకేపీ కార్యాలయం ఆవరణలో ఇప్పటికే స్వయం సహాయ సంఘాల ఆధ్వర్యంలో క్యాంటిన్లు వెలిశాయి.

రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటుకు కార్యాచరణ

ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక, పర్యాటక ప్రాంతాలు, ఆలయాలు, మార్కెట్లు, ఆర్టీసీ బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించారు. అందుబాటులో ఉండే ధరలకు నాణ్యమైన ఆహార పదార్థాలు లభిస్తాయి. మహిళా సంఘం సభ్యులతో ఆహార పదార్థాలు, పిండి వంటలు, మిఠాయిలు, పచ్చళ్లు, పండ్ల రసాలు, సంప్రదాయ వంటకాలు తయారు చేయించి విక్రయాలు చేపడుతున్నారు.

ప్రతిపాదిత ప్రాంతాలివే..

- ఆదిలాబాద్ : కోర్టు ఆవరణ, మున్సిపల్ కార్యాలయం, కలెక్టరేట్
- నిర్మల్ : ఏరియా ఆసుపత్రి, మెడికల్ కాలేజీ, మాతా శిశు ఆసుపత్రి
- ఖానాపూర్ : తహసీల్దారు కార్యాలయం, ఆసుపత్రి ఆవరణ, మున్సిపల్ కార్యాలయం
- మంచిర్యాల : మున్సిపల్ కార్యాలయం, మాతా శిశు ఆసుపత్రి, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణం, బస్టాండ్
- భైంసా : ఏరియా ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం
- కుమురంభీం : ఈఎస్ఐ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం
- బెల్లంపల్లి : ఏరియా ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం

☛ మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో ఆగస్టు 15న ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను స్నేహలత గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించారు. చాయ్, అల్పాహారం, నీళ్ల సీసాలు, శీతల పానీయాలు, ఇతర తినుబండారాలను, ఆహార పదార్థాలను నిర్వాహకులు అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో నిర్వాహకులకు ఉపాధితోపాటు ఇక్కడికి వచ్చే వారికి అందుబాటులో రుచికరమైన నాణ్యమైన ఆహార పదార్థాలు లభిస్తుండటంతో సమయం ఆదా అవుతోంది.


క్యాంటిన్‌లో అల్పాహారం, భోజనాలు చేస్తున్న వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు, కలెక్టరేట్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది

ఉమ్మడి జిల్లాలో 20కి పైగా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20కి పైగా మహిళా శక్తి క్యాంటిన్ల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించారు. మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట, నస్పూరు మినహా మిగతా ఎక్కడా వీటి ఏర్పాటు జరగలేదు.


మంచిర్యాల కలెక్టరేట్ కార్యాలయంలో గ్రామైక్య సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్



అద్దె భారం తప్పింది

\- గురిజాల లత, స్వయం సహాయక సభ్యురాలు, హాజీపూర్

నేను మరో ముగ్గురు సభ్యులం కలిసి కలెక్టరేట్‌లో క్యాంటిన్‌ను ఏర్పాటు చేశాం. వీటి ఏర్పాటుకు ఉచితంగా గది ఇవ్వడంతో అద్దె భారం తప్పింది. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు క్యాంటిన్ నిర్వహిస్తున్నాం. ఉదయం అల్పాహారం, పాలు, కాఫీ, టీలతో పాటు మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టీ, కాఫీ ఇతర స్నాక్స్ అందుబాటులో ఉంచాం.

ఈదురుగాలులతో వర్షం.. పంటకు నష్టం


లోకేశ్వరంలో ఈదురుగాలులతో కూడిన వర్షానికి నేలకొరిగిన వరిపైరు

లోకేశ్వరం, కుంటాల, కుభీరు న్యూస్‌టుడే: లోకేశ్వరం, కుంటాల, కుభీరు మండలాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో చేతికొచ్చిన దశలో వరిపైర్లు నేలకొరిగాయి. ఒక్కసారిగా వర్షం రావడంతో కల్లాల్లో ఆరబోసిన ధాన్యంపై టార్పాలిన్లు సైతం కప్పుకోలేని స్థితి ఏర్పడింది. అడుగు భాగంలోని సోయా గింజలు బూజు పట్టి దెబ్బతింటున్నాయి. పలు చోట్ల మొలకలు వచ్చాయి. వ్యవసాయ క్షేత్రాల్లోని పత్తి వర్షానికి తడిసిపోయింది. కుభీరు, చొండి, పార్డి(కె), సాంగ్వి, పల్సి గ్రామాల రహదారులపై ఆరబోసిన సోయా పంట తడిసిపోయింది.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో శిక్షకులు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : నిర్మల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని శిక్షకులు తెలిపారు. మంగళవారం నిర్మల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఇటీవల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్థాయిలో అండర్-17 బాలబాలికల విభాగంలో పూనమ్ చౌదరి(50 కిలోలు), సుకన్య(58 కిలోలు), శ్రీహాన్(50 కిలోలు)లో ప్రతిభ కనబర్చారని చెప్పారు. బుధ, గురు, శుక్రవారాల్లో గద్వాల జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొననున్నారని వెల్లడించారు. శిక్షకులు అమ్ముల భూషణ్, చిరంజీవి, వంశీ, వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారిని అభినందించారు.

సభ్యత్వ నమోదుతో పార్టీ బలోపేతం : యెండల


భైంసాలో మాట్లాడుతున్న యెండల లక్ష్మీనారాయణ

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: ప్రజాదరణ ఆధారంగా సభ్యత్వం పెరుగుతుందని, ఇది పార్టీని బలోపేతం చేసేందుకు దోహదపడుతుందని భాజపా సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సభ్యత్వ నమోదు పూర్తిచేయాలని సూచించారు. భాజపా పనితీరుపై ప్రజలంతా విశ్వాసంతో ఉన్నారని, ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో వారి ఆదరణ దీనికి నిదర్శనమని వివరించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు మల్లికార్జున్‌రెడ్డి, సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌ఛార్జి కమల్‌నయన్, నియోజకవర్గ కన్వీనర్ గాదె విలాస్, పట్టణాధ్యక్షుడు సాదం అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

భైంసా: కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలని భాజపా సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీ నారాయణ అన్నారు. పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగు మిల్లులో మంగళవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సమీక్షించారు. ప్రధాని పేదల కోసం ప్రవేశపెట్టిన పథకాలు, అభివృద్ధిని వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పడిపల్లి గంగాధర్, పట్టణాధ్యక్షుడు మల్లేశ్, నాయకులు రమేశ్, అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

రహదారుల పనులకు భూమి పూజ

సారంగాపూర్, న్యూస్‌టుడే : నిర్మల్ నియోజకవర్గంలో 30 రహదారుల నిర్మాణానికి రూ.వంద కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జామ్-బోరింగ్‌తండా గ్రామాల నడుమ రూ.3.20 కోట్లతో నూతనంగా నిర్మించే రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. మరిన్ని రహదారుల నిర్మాణానికి మరో రూ.వంద కోట్ల నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. ఆర్‌అండ్‌బీ ఈఈ అశోక్, పీఆర్ డీఈ తుకారాం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

పేదలపై అభిమానం.. సేవే పరమార్థం



● పల్లెబాట పట్టిన సివిల్ సర్వీస్ శిక్షణ అధికారులు

సివిల్ సర్వీస్ శిక్షణ అధికారుల బృందం క్షేత్రస్థాయి శిక్షణలో భాగంగా పల్లెబాట పట్టింది. ఆదిలాబాద్ గ్రామీణ మండలం లోకారి, ఖండాల, తదితర గ్రామాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్న అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలిస్తున్నారు. ఆదివాసీల స్థితిగతులు, తాగునీరు, రహదారులు, విద్యుత్తు సౌకర్యాలు, పాడిపంటలు, రవాణా సౌకర్యం, వ్యవసాయ పద్ధతులు అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను తెలుసుకుంటూ గ్రామాభివృద్ధికి సలహాలు, సూచనలు అందిస్తున్నారు. గుర్తించిన సమస్యలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందిస్తామన్నారు. ఈ పర్యటన ఎంతో ఉపయోగపడుతున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి ప్రతిష్ఠాత్మక సివిల్ సర్వీస్‌లో ఉన్న శిక్షణ అధికారులు ప్రజా సేవే లక్ష్యమని, పేదలంటే అభిమానమని, వారికి సేవ చేయడం ఆనందంగా భావిస్తున్నట్లు 'ఈనాడు'తో వారి మనోగతాన్ని పంచుకున్నారు. ప్రణాళికాబద్ధంగా, పట్టుదలతో చదివితే లక్ష్యానికి పేదరికం అడ్డురాదని నేటి యువతకు దిశానిర్దేశం చేశారు.

-న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం



నాన్న కష్టమే ఐపీఎస్‌ను చేసింది



నేను రైతు బిడ్డను. నాన్న వ్యవసాయంలో ఆరుగాలం పడే కష్టం ముందు నా లక్ష్యం అసాధ్యం కాదనిపించింది. ప్రాథమిక విద్య, ఇంటర్ ప్రైవేటులో.. డిగ్రీ బీఎస్సీ కంప్యూటర్ ప్రభుత్వ కళాశాలలో పూర్తి చేశా. ఎలాంటి శిక్షణ లేకుండా ఇంటి వద్దనే సొంత ప్రిపరేషన్‌తో రోజూ 8 గంటలు చదివేవాడిని. ఎలాంటి శిక్షణ లేకుండానే మొదటి ప్రయత్నంలో సివిల్స్‌లో ఐపీఎస్‌కు ఎంపికయ్యాను. నిబద్ధత, పట్టుదల, ఇష్టంతో చదివితే సాధ్యం కానిది ఏది లేదు.

- రాంనీక్ గౌతమ్, ఐపీఎస్ శిక్షణ అధికారి, ఉత్తరప్రదేశ్

ఓడిపోతే కుంగిపోవద్దు..



పట్టుదలతో ప్రణాళికాబద్ధంగా ఒకటి కాదు.. రెండు కాదు. . మూడేళ్లు కష్టపడి చదివాను. లక్ష్య సాధనలో ఎన్నో ఆటుపోట్లు వచ్చినా లక్ష్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాను. అనుకున్నది సాధించి ఐఎస్ఎస్‌కు ఎంపికయ్యాను. నాన్న చతుర్భుజ్ గుప్తా వ్యాపారం చూసుకుంటారు. అమ్మ కామిని గుప్తా గృహిణి. వారి ప్రోత్సాహంతోనే విజయం సాధించాను. ఒక్కసారి ఓడిపోగానే వదిలేయొద్దు.

- ప్రకర్ గుప్తా, ఐఎస్ఎస్, ఉత్తరప్రదేశ్



ఆదిలాబాద్ మండల అధికారులతో సివిల్ సర్వీస్ శిక్షణ అధికారులు

దిల్లీకి వెళ్లాల్సిన అవసరం లేదు



- కౌషల్ కిశోర్, ఐఎఫ్ఎస్, బిహార్

సివిల్స్ సన్నద్ధతలో ఆన్‌లైన్ విద్యకు ప్రాధాన్యమిచ్చా. బీటెక్ ఐఐటీ దిల్లీలో పూర్తి చేశా. ఐఐటీ జేఈఈలో టెక్నాలజీ కన్సల్టెంట్‌గా పని చేశా. ఉద్యోగం చేస్తూనే ఆన్‌లైన్‌లోనే శిక్షణ తీసుకున్నాను. సివిల్స్‌లో శిక్షణ కోసం దిల్లీకి వెళ్లాల్సిన అవసరం లేదు. ఒకవేళ శిక్షణ కావాలనుకున్నవారు హైదరాబాద్‌లో తీసుకుంటే సరిపోతుంది. ప్రణాళిక, సరైన మార్గాన్ని ఎంచుకుంటే అనుకున్నది సాధించడానికి అవకాశం ఉంటుంది.

పోలీసులపై నమ్మకం కలిగిస్తా




వ్యక్తిగత నైపుణ్యం, పట్టుదల ఉంటే సివిల్స్ విజయం సాధించవచ్చు. యూట్యూబ్, గూగుల్ మాధ్యమాల ద్వారా మనకు అవసరమైన సమాచారం సులువుగా పొందవచ్చు. చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇంకా ఎలాంటి ఆలోచనలకు అవకాశం ఇవ్వొద్దు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే లక్ష్యాన్ని చేరుకున్నాను. ప్రజాసేవే లక్ష్యంగా పని చేస్తాను. పోలీసులపై మరింత నమ్మకం కలిగిస్తాను.

- రోషన్, ఐపీఎస్ శిక్షణ అధికారి, రాజస్థాన్

వార్తా పత్రికలు రోజూ చదవాలి

- ప్రసాద్ కృష్ణన్, ఐఆర్ఎస్, కేరళ



మాది కేరళలోని త్రివేంద్రం. నాన్న నందాకుమారన్ ప్రైవేట్ ఉద్యోగి. అమ్మ ప్రైవేట్ ఉపాధ్యాయురాలు. సివిల్స్ సన్నద్ధతలో భాగంగా వార్తా పత్రికలు రోజూ చదవాలి. అవి మన జనరల్ నాలెడ్జిని, విశ్లేషించే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయి. శిక్షణలో ముఖ్యంగా సాధన ఎక్కువగా ఉండాలి. ప్రతి అంశంపై పట్టు సాధించాలి. అమ్మానాన్నల కష్టాలను చూసి అనుకున్న లక్ష్యం వైపు వెనుకడుగు వేయకుండా ప్రయత్నించా. చెన్నైలో ఐఆర్ఎస్ కస్టమ్స్, పరోక్ష పన్నులో పోస్టు ఇచ్చారు. పేదలకు సేవ చేయడం వరంగా భావిస్తున్నాను.

ప్రతికూలతలు దాటి.. విజేతగా నిలిచి!

● పెళ్లి.. పిల్లలు కొలువుకు ఆటంకం కాదని నిరూపించిన సుమలత

న్యూస్‌టుడే, ఉట్నూరు :



పేద కుటుంబంలో జన్మించి ప్రతికూల పరిస్థితుల మధ్య చదివింది ఆమె.. చిన్న వయసులోనే పెద్దలు పెళ్లి చేశారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యం ముందు అవన్నీ కరిగిపోయాయి. గృహిణిగా ఉంటూనే.. భర్త ప్రోత్సాహంతో ఉన్నత విద్యను పూర్తి చేసి రాత్రింబవళ్లు కష్టపడి విజయం సాధించారు. ఇటీవల విడుదలైన ఉద్యోగాల ఫలితాలలో ఎస్జీటీగా కొలువు సాధించి ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారు.

నిర్మల్ జిల్లా కడెం మండలానికి చెందిన రాపెల్లి రాయలింగు, సత్తవ్వ దంపతులది నిరుపేద వ్యవసాయ కుటుంబం. వీరికి రవీందర్, వెంకటేష్, సుమలత ముగ్గురు సంతానం. సుమలత స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివారు. పదో తరగతిలో 526 మార్కులు సాధించి స్థానికుల మన్ననలు అందుకున్నారు. తల్లిదండ్రులు అప్పులు చేసి మంచిర్యాలకు పంపించి ఇంటర్ చదివించారు. ఆ తరువాత ఆమె టీటీసీ ప్రవేశ పరీక్ష రాసి ర్యాంకు పొందడంతో ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డైట్ కళాశాలలో టీటీసీ సీటు సాధించారు. కుటుంబ పరిస్థితుల కారణంగా తల్లిదండ్రులు ఆమె టీటీసీ చేస్తుండగానే కొండా సత్యం అనే యువకుడికి ఇచ్చి వివాహం చేశారు.

భర్త ప్రోత్సాహంతో..

టీటీసీ చేస్తుండగానే పెళ్లి చేసినా.. లక్ష్యాన్ని మాత్రం వీడలేదు. ఆమెకు హిమన్ష్, మేధాన్ష్ అనే ఇద్దరు పిల్లలు జన్మించారు. ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలనేది తన ఆశయమని భర్త సత్యంతో మనసులోని మాటను పంచుకున్నారు. భర్త ఆమెను ప్రోత్సహించడంతో టీటీసీ పూర్తి చేయడంతోపాటు డిగ్రీ చదివారు. బీఈడీ ప్రవేశ పరీక్ష రాసి ర్యాంకు సాధించి బీఎడ్ చేశారు. పీజీలో ఎమ్మెస్సీ మ్యాథ్స్ చేశారు. ఉద్యోగాల కోసం కసితో సాధన చేశారు. డీఎస్సీ రాశారు. మంచి ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఉద్యోగం పొందారు. పెళ్లయిన పదేళ్ల తరువాత తన కలను నెరవేర్చుకున్నారు. తాజాగా దస్తురాబాద్ మండం గొడిసిర్యాలలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో టీచరుగా తొలి పోస్టింగ్ పొందారు. పెళ్లి.. పిల్లలు.. కుటుంబ బాధ్యతలు ఇవేవి విజయానికి అడ్డుకాదని నిరూపించారు.

సమీకృత వ్యవసాయం, సాంకేతిక విధానంపై అవగాహన



విద్యార్థులకు డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం జగిత్యాల, సిరిసిల్ల కళాశాలలకు చెందిన కృషి అనుభవ విద్యార్థులకు సమీకృత వ్యవసాయ విధానం, డ్రోన్ సాంకేతిక విధానంపై మంగళవారం మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి అవగాహన కల్పించారు. మందమర్రి మండలంలోని బొక్కలగుట్ట గ్రామంలోని సమీకృత వ్యవసాయ క్షేత్రంలో సమీకృత వ్యవసాయ విధానంపై అవగాహన కల్పించారు. సమీకృత వ్యవసాయ విధానంలో వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి, చేపలు, కోళ్లు, తేనెటీగల పెంపకం, చిన్నతరహా పరిశ్రమలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ విధానంతో రైతుకు ఎక్కువ నికర ఆదాయంతో పాటు నష్ట భయం తగ్గుతుందని తెలిపారు. సారంగపల్లి గ్రామంలోని ఓ పొలంలో డ్రోన్ పరికరం ద్వారా పురుగు మందుల పిచికారీపై ప్రదర్శనాత్మక అవగాహన కల్పించారు. ఈ విధానం ద్వారా పది లీటర్ల నీటిని ఉపయోగించి ఆరు నిమిషాల్లో ఒక ఎకరా విస్తీర్ణంలో పురుగు మందులు పిచికారి చేసుకోవచ్చని తెలిపారు. ఏఈఓలు ముత్యం తిరుపతి, కనకరాజు, విద్యార్థులు తిరుపతి, శ్రీధర్, నవితేజ, శ్రీచరణ్, విపిన్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు లేక.. పర్యవేక్షకులకు పరీక్ష



ఈఎన్‌టీ ఓపీ విభాగంలో మంగళవారం పరీక్షలు నిర్వహిస్తున్న పర్యవేక్షణాధికారి డా.హరిశ్చంద్రారెడ్డి

మంచిర్యాలలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతోంది. జనరల్ మెడిసిన్‌లో వైద్యులు సక్రమంగా రావడం లేదు. పిల్లల విభాగం పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. ఇప్పుడు ఈఎన్‌టీ(చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు) వంతు వచ్చింది. ఉన్న ఇద్దరు సెలవులో ఉండటంతో తప్పని పరిస్థితుల్లో ఆయా విభాగం ప్రొఫెసర్, జీజీహెచ్ పర్యవేక్షణాధికారి ఓపీ గదిలో ఉండాల్సి వస్తోంది.

- న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ

పక్షం రోజులే గడువు!




● ఎమ్మెల్సీ ఓటరు నమోదులో టీచర్లు, పట్టభద్రుల నిర్లిప్తత

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే:

పట్టభద్రుల, ఉపాధ్యాయ మండలి ఎన్నికల సందడి మొదలైంది. ఇందుకు కీలమైన ఓటరు నమోదు ప్రక్రియ మాత్రం మందకొడిగా సాగుతోంది. ఓటు నమోదు దరఖాస్తుల స్వీకరణకు నవంబరు ఆరో తేదీ తుది గడువు. అంటే మరో పక్షం రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది.



జిల్లాలవారీగా ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు



జిల్లా	ఉపాధ్యాయులు	పట్టభద్రులు
కుమురంభీం	12	1,049
మంచిర్యాల	61	7,742
ఆదిలాబాద్	37	3,063
నిర్మల్	55	4,838

● జిల్లా ● ఉపాధ్యాయులు ● పట్టభద్రులు


బోధకుల నిరాసక్తత



సాధారణంగా ఉపాధ్యాయ, అధ్యాపక వృత్తిలో కొనసాగే వారిని మేధావివర్గంగా భావిస్తుంటాం. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు విషయంలో మాత్రం ఆ వర్గం దూరంగా ఉంటోంది. పలు సంఘాలు పాఠశాలలకు వెళ్లి స్వచ్ఛందంగా నమోదు పత్రాలు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 30 వేల మంది టీచర్లు, అధ్యాపకులు ఉండగా ఇప్పటి వరకు 165 మంది మాత్రమే ఎమ్మెల్సీ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు.

ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పట్టభద్రులు, టీచర్లు ఓటర్లుగా ఉంటారు. మండలి ఎన్నికల్లో ఓటు వేయాలంటే కొత్తగా అర్హులంతా దరఖాస్తు చేసుకోవాల్సిందే. కిందటి ఎన్నికల ఓటరు జాబితాలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో టీచర్లు 4,599 మంది, పట్టభద్రులు 38,908 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం ఇప్పటి వరకు టీచర్లు 165 మంది దరఖాస్తు చేసుకుంటే పట్టభద్రుల ఓటు కోసం 16,692 మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

కేంద్రాలు వెలవెల..



అన్ని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో టీచరు, పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక అధికారిని నియమించి దరఖాస్తులను అందుబాటులో ఉంచినా ఆ కేంద్రాలకు వచ్చేవారే కరవయ్యారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉన్నా ఓటర్ల నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉంటోందని అధికారవర్గాల మాట.

ఎవరు అర్హులు..

పట్టభద్రులు ఓటు నమోదు(ఫాం-18) చేసుకోవాలంటే 2021 అక్టోబరు 31 నాటికి డిగ్రీ పూర్తయి ఉండాలి. టీచర్లు/అధ్యాపకులైతే 2018 నవంబరు ఒకటి నుంచి 2024 అక్టోబరు 31 వరకు మూడు సంవత్సరాలకు తగ్గకుండా ఉన్నత పాఠశాల, కళాశాల స్థాయి విద్యాసంస్థల్లో పనిచేసి ఉంటే వారు ఫారం-19 పూరించి ఓటు నమోదు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్‌లో నమోదు ఇలా

ఇంటి వద్ద నుంచి ఓటు నమోదు చేసుకోవాలనుకునే వారు www.ceotelangna.nic.in వెబ్‌సైటును సంప్రదించి పట్టభద్రులైతే ఫారం-18, టీచర్లయితే ఫారం-19 దరఖాస్తును పూరించి గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన డిగ్రీ సర్టిఫికెటు, ఆధార్, ఓటరు ఐడీ పత్రాలతోపాటు ఫొటోను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవచ్చు.



జగదాంబ ఆలయంలో కొనసాగుతున్న విద్యార్థుల చదువులు

గుడిలో సాగుతున్న బడి

ఈటీవీ - ఆదిలాబాద్, న్యూస్‌టుడే - బేల :

అక్షరాలు నేర్చుకోవాలంటే బడికి వెళ్లాలి. పూజా కార్యక్రమాలకు గుడికి వెళ్లాలి. ఇది అందరికి తెలిసిందే. బేల మండలం పిట్‌గావ్(ఎల్) చిన్నారులు చదువుకోవటానికి బడికి కాకుండా గుడికి వెళ్తున్నారు. ఇక్కడ అంతా గిరిజనులే. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు మొత్తం 36 మంది విద్యార్థులు ఉన్నారు. పాత బడి శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం ఏడాది కిందట రూ.21 లక్షలు కేటాయించింది. విద్యాశాఖాధికారులు, ఇంజినీర్ల పర్యవేక్షణ కరవై గుత్తేదారు పిల్లర్లు వేసి భవన నిర్మాణాన్ని మధ్యలోనే వదిలేశాడు. స్థానికులంతా కలిసి ఆరునెలల కిందటి వరకు గ్రామంలోని హనుమాన్ ఆలయంలో, తాజాగా ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న జగదాంబ దేవి ఆలయంలో చదువులను కొనసాగిస్తున్నారు. తాజాగా నియామకాల్లో కొత్తగా ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయుడు హరికృష్ణ ఆ గుడిలోనే పిల్లలకు బోధిస్తున్నారు.

☛ ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోలేదని.. పిల్లల చదువులకు ఆటంకం ఏర్పడకూడదనే ఆలోచనతో గుడిలో ఏర్పాటుచేసిన బడికి పంపిస్తున్నామని గ్రామస్థులు జాదవ్ విలాస్, పవార్ గోపీ ఆవేదన వ్యక్తం చేశారు.

☛ జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీతను 'ఈనాడు' సంప్రదించే ప్రయత్నం చేయగా స్పందించలేదు.



పిట్‌గావ్(ఎల్)లో ఆగిపోయిన పాఠశాల కొత్త భవన నిర్మాణ పనులు

అయిదుగురు ఏఈఓల సస్పెన్షన్

లక్షెట్టిపేట, న్యూస్‌టుడే: రైతు బీమా విషయంలో నిర్లక్ష్యం వహించినందుకు మంచిర్యాల జిల్లాలోని అయిదుగురు వ్యవసాయ విస్తరణాధికారుల(ఏఈఓ-గ్రేడ్)ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. లక్షెట్టిపేట, జైపూర్, బెల్లంపల్లి, నస్పూర్, చెన్నూరు మండలాలకు చెందిన ఒక్కో ఏఈఓను సస్పెండ్ చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి కల్పనను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా జిల్లాలోని అయిదుగురు ఏఈఓలను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు.

ఉపకార వేతనం.. భవితకు ఊతం





దండేపల్లి, న్యూస్‌టుడే:

చదువుకోవాలనే తపన ఉన్నా ఆర్థిక స్థోమత లేక ఎంతో మంది విద్యార్థులు తమ చదువులను అర్ధంతరంగా ఆపేసిన సంఘటనలు ఉన్నాయి. ఈ తరుణంలో ప్రతిభ ఉన్న విద్యార్థులకు ప్రభుత్వం ఊతం అందిస్తోంది. వీటిని అందిపుచ్చుకుని ఉన్నత విద్యను అభ్యసిస్తూ ముందుకు సాగుతున్నారు. పరీక్షలో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపకార వేతనాలు (ఎన్ఎంఎంఎస్) అందిస్తోంది. నాలుగేళ్ల పాటు ఉపకారం అందుకుంటూ ఉన్నత చదువులు చదివే అవకాశముంది. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జాతీయ స్థాయిలో పరీక్ష ఉంటుంది. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఏటా రూ. 12 వేల చొప్పున తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు నాలుగేళ్ల పాటు ఉపకారవేతనం అందిస్తారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అర్హులు. వచ్చే నెల 24న అన్ని జిల్లా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు.

ఇందులో మొత్తం 180 మార్కులు ఉండగా పరీక్షలో రెండు విభాగాలు ఉంటాయి.

☛ మొదటిది (పార్ట్ 1): మానసిక సామర్థ్య పరీక్ష 90 ప్రశ్నలకు 90 మార్కులుంటాయి. ఇందులో రీజనింగ్ ఎబిలిటిస్, సంఖ్యా శాస్త్రం, పదాల భిన్న పరీక్ష, నంబర్ అనాలజీ, ఆల్ఫాబెట్ అనాలజీ, కోడింగ్-డీకోడింగ్, లాజికల్ ప్రశ్నలు, వెన్‌చిత్రాలు, మిర్రర్ ఇమేజెస్, వాటర్ ఇమేజెస్ తదితర అంశాలలో ప్రశ్నలు ఉంటాయి. వీటిని సాధన చేయాలి.

☛ రెండో విభాగంలో ఏడు, ఎనిమిదో తరగతి సిలబస్ నుంచి 90 ప్రశ్నలు, 90 మార్కులుంటాయి. గణితం 20 మార్కులు, భౌతిక, రసాయన, జీవ శాస్త్రం కలిపి 35 మార్కులు, సాంఘీక శాస్త్రంలో 35 మార్కులు. పరీక్ష ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో బహుళైచ్ఛిక (మల్టిపుల్ ఛాయిస్) రూపంలో ఉంటాయి. పరీక్షకు కేవలం నెల రోజులు మాత్రమే ఉండటంతో ప్రణాళికాబద్ధంగా సాధన చేస్తే విజయం దక్కుతుంది. ఉమ్మడి జిల్లా నుంచి 240 మంది వరకు ఎన్నికయ్యే అవకాశముంది.



సాధన చేస్తున్న విద్యార్థులు

ఈ ఏడాది జిల్లాల వారీగా పరీక్ష రాసే విద్యార్థులు

జిల్లా	అభ్యర్థులు
ఆదిలాబాద్	564
మంచిర్యాల	1059
నిర్మల్	926
కుమురంభీం	482

● జిల్లా ● అభ్యర్థులు

ఉన్నత చదువులు చదువుతూ..

-రాంటెంకి విష్ణువర్ధన్



జన్నారం మండలం కిష్టాపూర్ ఉన్నత పాఠశాలలో చదివిన రాంటెంకి విష్ణువర్ధన్ ఎనిమిదో తరగతి పూర్తికాగానే జాతీయ ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. ఉపకార వేతనం పొందుతూ ఇక్కడే పదో తరగతి పూర్తి చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని సెంట్రల్ ఆఫ్ ఎక్సెలెన్సీలో ఇంటర్మీడియట్ చేస్తున్నారు. తన చదువులకు ఉపకార వేతనం ఎంతో తోడ్పడిందని ఆయన చెబుతున్నారు. ఇదే పాఠశాల నుంచి గతేడాది పది మంది విద్యార్థులు ఎంపికకాగా ఇప్పటి వరకు 240 మంది ఎంపిక కావడం గమనార్హం..

ప్రణాళికాబద్ధంగా సాధన

- ముత్తె వెంకటమల్లు, ఉపాధ్యాయుడు, వెల్గనూర్



ఉపకార వేతనం మధ్యతరగతి, పేద కుటుంబ బాల విద్యార్థులకు ప్రయోజనం. విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం వరిస్తుంది. మంచి భవిష్యత్తు ఉంటుంది. గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రంలోని వివిధ పాఠాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. మానసిక సామర్థ్యానికి సంబంధించిన అంశాలను రోజూ సాధన చేయాలి. గత పరీక్షల పేపర్లలో వచ్చిన ప్రశ్నలకు అనుగుణంగా సాధన చేయాలి.



● గతేడాది జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైన జన్నారం మండలం కలమడుగు విద్యార్థులతో ఉపాధ్యాయులు. పది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రతి రోజూ పరీక్ష రాయబోయే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి, ఉపాధ్యాయులు కలిసి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు.

ప్రాణం తీసిన కరెంట్



సతీష్

కోటపల్లి, న్యూస్‌టుడే: వ్యవసాయంలో తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. సాగు పనుల్లో తండ్రితో పాటు బాధ్యతను పంచుకున్నాడు. ప్రమాదవశాత్తు జరిగిన విద్యుదాఘాతంతో యువరైతు విగత జీవిగా మారాడు. ఈ ఘటన ఆ కుటుంబంలో తీరని శోకాన్ని నింపింది. వివరాల్లోకి వెళ్తే.. కోటపల్లి మండలం రాపన్‌పల్లి గ్రామానికి చెందిన భూర్తి సతీష్ (25) యువరైతు మంగళవారం పత్తి చేనుకు నీటి తడులను అందించేందుకు వెళ్లాడు. మోటారుకు విద్యుత్తు సరఫరా చేసే తీగ చెడిపోయి నీటిని బయటికి వదిలే ఇనుప పైపునకు తాకి ఉంది. ఇది గమనించని సతీష్ మోటారును స్టార్ట్ చేసి సంబంధిత పైపును పట్టుకోవడంతో విద్యుత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. రాజబాపు - పద్మ దంపతులకు ఇద్దరు కొడుకులు ఉండగా మృతుడు సతీష్ మొదటి సంతానం. తమకున్న కొద్ది పాటు భూమితో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని జీవనోపాధి పొందుతున్న కుటుంబంలో కుమారుడు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎస్సై రాజేందర్ సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు.

27న మందకృష్ణ మాదిగ రాక

జన్నారం, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈ నెల 27న జన్నారం వస్తున్నట్లు మాదిగ సంఘం జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, మండల అధ్యక్షుడు కొండుకూరి ప్రభుదాస్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లుగా వారు పేర్కొన్నారు. నాయకులు మామిడిపెల్లి ఇంద్రయ్య, కృష్ణ, రమేశ్, రవి, రాజేశ్, ఎల్లయ్య, రాహుల్, అంజన్న, వెంకటేశ్, ప్రశాంత్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

?: పట్టణంలోని పద్మావతినగర్ బుడగజంగాల కాలనీలో మురుగు నీరు నిలిచి దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నీరు నిల్వ ఉండకుండా చూడాలి. -నర్సయ్య, కాలనీవాసి

✓: పరిశీలించి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపడతాం. - మానాల శంకర్, పురపాలిక శానిటేషన్ ఇన్‌ఛార్జి

?: పట్టణంలోని శాంతినగర్ కాలనీ నుంచి మార్కెట్‌యార్డుకు వెళ్లే సీసీ దారి దెబ్బతింది. సిమెంట్ వేసి గుంతలు పూడ్చాలి. - ప్రవీణ్, కాలనీవాసి

✓: గుంతలు పరిశీలించి అవసరమైన చోట మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు చేపడతాం. - మనోహర్, మున్సిపల్ కమిషనర్, ఖానాపూర్

-న్యూస్‌టుడే, ఖానాపూర్

పైపులైన్‌కు మరమ్మతులు



పాత ఎల్లాపూర్‌లో పైపులైన్ పగిలిన చోట మరమ్మతులు చేస్తున్న మిషన్ భగీరథ సిబ్బంది

ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. ఈ సమస్యపై మంగళవారం ఈనాడులో 'మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి నీరు వృథా' శీర్షికన వార్త ప్రచురితం అయింది. దీనికి గ్రామ పంచాయతీ సిబ్బంది, మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. పైపులైన్ పగిలిన చోట నీరు లీకేజీ కాకుండా మరమ్మతులు చేయించారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు : కలెక్టర్

నిర్మల్, న్యూస్‌టుడే : ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వేగవంతంగా పరిష్కరించాలని పాలనాధికారి అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని మంజులాపూర్‌లో చేపట్టిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన తీరును పరిశీలించారు. ప్రభుత్వ భూములు కాపాడాలని, చెరువులు, కుంటలు, కాలువల హద్దులు గుర్తించాలని సూచించారు. ఎన్ఆర్ఎస్ ప్రక్రియలో భాగంగా నీటి పారుదల, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక యాప్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ సి.వి.ఎన్.రాజు, అర్బన్ తహసీల్దార్ రాజు, నీటి పారుదలశాఖ ఏఈఈ మిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి గోడప్రతుల ఆవిష్కరణ

నిర్మల్: చెకుముకి సైన్స్ సంబురాలు-2024 పరీక్ష నిర్వహణ గోడప్రతులను మంగళవారం కలెక్టరేట్‌లో పాలనాధికారి అభిలాష అభినవ్ ఆవిష్కరించారు. నవంబరు 7న పాఠశాల స్థాయిలో, 21న మండల స్థాయిలో 28న జిల్లా స్థాయిలో, డిసెంబరు 14, 15, 16 తేదీల్లో రాష్ట్రస్థాయిలో పోటీలు జరుగుతాయని చెప్పారు.

బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

నిర్మల్, న్యూస్‌టుడే : జిల్లాలో బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని పాలనాధికారి అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కార్యక్రమం అమలుపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించాలని సూచించారు. రోజువారీ బ్యాంకింగ్ కార్యకలాపాలు, బ్యాంకులు పౌరులకు అందించే సేవల గురించి తెలపాలన్నారు.

కొవ్వొత్తులతో అమరవీరులకు నివాళులు



నర్సాపూర్(జి)లో కొవ్వొత్తులతో పోలీసులు, గ్రామస్థులు

దస్తూరాబాద్, న్యూస్‌టుడే: పోలీసు సంస్మరణ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా దస్తూరాబాద్ పోలీస్‌స్టేషన్లో మంగళవారం రాత్రి ఎస్సై శంకర్, సిబ్బంది కొవ్వొత్తులతో నివాళులర్పించారు. అమరులను స్మరించుకున్నారు. ఏఎస్సై శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తులు వెలిగించి పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. ఎస్ఐ హన్మాండ్లు, ఏఎస్ఐ మాన్‌సింగ్, సిబ్బంది అన్వర్‌అలీ, మహేందర్, కృష్ణ పాల్గొన్నారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : విశ్రాంత ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సి.లింగన్న అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీటీవో కార్యాలయంలో జిల్లా ఖజానా అధికారిణి సరోజకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కమిషన్ ఆఫ్ వాల్యూ పెన్షన్(సీవీపీ) విషయంలో ఉద్యోగ విరమణ చేసిన వారికి తగిన న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల హన్మంత్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి లోలం గంగన్న పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

కుంటాల, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని భైంసా గ్రామీణ సీఐ ఎం.నైలు అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వానల్‌పాడ్‌లో మంగళవారం వాహనాలను తనిఖీ చేసి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో తనిఖీ చేసి సరైన పత్రాలు లేని 74 ద్విచక్రవాహనాలు, మూడు నాలుగు చక్రాల వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సరైన వాహన పత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు. ఎస్సైలు శ్రీనివాస్‌యాదవ్, భాస్కరచారి, ఏఎస్సైలు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ పట్టణం: సాంకేతికత వినియోగంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రిన్సిపల్ శ్రీనివాస్‌శెట్టి అన్నారు. స్థానిక వాసవి వరల్డ్ పాఠశాలలో మంగళవారం సైబర్ సెక్యూరిటీపై నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. మోసపూరిత ఈమెయిల్స్ తెరవొద్దని, అపరిచిత కాల్స్‌కి సమాధానం ఇవ్వద్దని సూచించారు. మౌనిక, జగదీశ్‌రెడ్డి, శైలాజాయ్‌సన్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి పోవద్దు

కుంటాల: మత్తు పదార్థాలకు అలవాటు పడితే చక్కటి జీవితాలు చిత్తవుతాయని ఎస్సై సీహెచ్.భాస్కరచారి అన్నారు. కుంటాలలో మంగళవారం మాట్లాడుతూ చిన్నారులు, యువత డ్రగ్స్, గంజాయి, మద్యం, చెడు వ్యసనాలకు బానిసలై తల్లిదండ్రుల ఆశయాలను విస్మరిస్తున్నారన్నారు. ఏఎస్సై దేవ్‌రావు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

భైంసా: మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దని సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఛైర్మన్ డా.సాప పండరి అన్నారు. పట్టణంలోని జీపీఎల్ డిగ్రీ కళాశాలలో మంగళవారం మాదకద్రవ్యాల నిషేధంపై అవగాహన కల్పించారు.

నిఘానేత్రాలతో పటిష్ఠ భద్రత

సారంగాపూర్: నిఘానేత్రాలు కలిగిన గ్రామాలు పటిష్ఠ భద్రతతో ఉంటాయని సీఐ రామకృష్ణ అన్నారు. మంగళవారం యాకర్‌పల్లిలో ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాలను ప్రారంభించారు. గతంలో పనిచేయని మరో నాలుగింటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చారు. ఎస్సై శ్రీకాంత్, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దాటవేత ధోరణి సరికాదు : తపస్



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం దాటవేత ధోరణి ప్రదర్శించడం సరికాదని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నవీన్‌కుమార్, సుదర్శన్ అన్నారు. మంగళవారం జిల్లావ్యాప్తంగా పలు పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశామన్నారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీ కమిటీ ఏర్పాటులో తాత్సారంతో ఉద్యోగులు నష్టపోతున్నారని చెప్పారు.

భైంసా: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తోందని తపస్ జిల్లా అధ్యక్షుడు టి.నవీన్ కుమార్ అన్నారు. సర్కారు వైఖరికి నిరసనగా రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పెండింగ్‌లోని డీఏ, పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి వి.సుదర్శన్, జి.రాజేశ్వర్, రాంనరేశ్, జె.జైస్వాల్‌చ ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్(జి): నందన్‌లో..



ఝరి(బి)లో..



దిలావర్‌పూర్‌లో..

కుమురంభీం పోరాటం స్ఫూర్తిదాయకం



నిర్మల్ అర్బన్ : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్

నిర్మల్ అర్బన్, నిర్మల్ పట్టణం, దస్తూరాబాద్, దిలావర్‌పూర్, భైంసా,నర్సాపూర్(జి), కడెం, న్యూస్‌టుడే : జిల్లావ్యాప్తంగా కుమురంభీం జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జల్, జంగల్, జమీన్ నినాదంతో కుమురం భీం చేసిన పోరాటాలు చిరస్మరణీయమని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. నిర్మల్‌లోని గొలుసుల దర్వాజ దగ్గర ఉన్న కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేశారు. కుమురం భీం సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమని భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక చైన్‌గేట్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడవిబిడ్డగా ఆయన సాగించిన విప్లవోద్యమం చరిత్రపుటల్లో నిలిచిపోతుందన్నారు.



కడెం : కుమురంభీం విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కోమల్‌రెడ్డి, ఏఎస్పీ అవినాష్‌కుమార్

సమస్యను పరిష్కరిస్తాం

ముథోల్, న్యూస్‌టుడే: మండలంలోని బోరిగాం గ్రామంలో నెలకొన్న భూసమస్యను త్వరగా పరిష్కరిస్తామని గ్రామస్థులు ఆందోళన చెందవద్దని భైంసా ఆర్డీఓ కోమల్‌రెడ్డి అన్నారు. కొన్ని రోజుల క్రితం గ్రామంలో భూసమస్యను పరిష్కరించాలని ఆర్డీఓకు వీరంతా వినతిపత్రాన్ని అందజేశారు. ఇందులో భాగంగా మంగళవారం ఆర్డీఓ, ఏఎస్పీ అవినాష్‌కుమార్‌లు గ్రామానికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. తహసీల్దార్ శ్రీకాంత్, ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై సాయికిరణ్ ఉన్నారు.

ప్రమాదానికి గురైన ఆసుపత్రి గదుల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఎమ్మెల్యే, భాజపా శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. రెండు రోజుల క్రితం ఆసుపత్రిలోని మొదటి అంతస్తులో విద్యుదాఘాతం కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకొని పలు వస్తువులు దగ్ధమైన విషయం తెలిసిందే. ఆయన ఆసుపత్రిలో ప్రమాదానికి గురైన గదులను పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కొనుగోలు కేంద్రాల ప్రారంభం

లక్ష్మణచాంద : ధాన్యం కొనుగోళ్ల కోసమే చాలా చోట్ల డీసీఎంఎస్ కేంద్రాలను వాడుకుంటున్నారని, కేంద్రాలు ఉన్న చోట ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని, లేదంటే కేంద్రాలను తొలగించి వేరే వారికి అప్పగిస్తామని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రాచాపూర్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. నాయకులు సత్యనారాయణగౌడ్, రావుల రాంనాథ్, భూపాల్‌రెడ్డి, అడ్వాల రమేష్, ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

సారంగాపూర్: అన్ని రకాల వరి ధాన్యానికి ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సారంగాపూర్ మండలం ఆలూర్ సహకార సంఘం, స్థానిక మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఎన్నికల్లో అన్ని రకాల వరి ధాన్యానికి బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సన్నాలకే ఇవ్వడం సరికాదన్నారు. డీఎస్‌వో కిరణ్‌కుమార్, మార్కెట్ ఛైర్మన్ అబ్దుల్‌హాది, పీఏసీఎస్ ఛైర్మన్ మాణిక్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

ముథోల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే



ముథోల్‌లో డిగ్రీ కళాశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

ముథోల్, న్యూస్‌టుడే: ముథోల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ముథోల్‌లో మంగళవారం డిగ్రీ కళాశాలను ప్రారంభించారు. అంతకు ముందు డిగ్రీ కళాశాల విద్యార్థులు, ప్రిన్సిపల్, బుచ్చయ్య, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం కళాశాలను ప్రారంభించి తరగతి గదులను పరిశీలించి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముథోల్‌లోనే ఇంటిగ్రేటెడ్(సామూహిక) వసతి గృహాలను నిర్మిస్తున్నామన్నారు. ముథోల్‌కు మంజూరైన మహాత్మా జ్యోతిబాపులే ఇంటర్ కళాశాలను నిర్మల్‌లో నిర్వహిస్తున్నారన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి నవంబరు మొదటివారంలో దీన్ని నిర్మల్ నుంచి ముథోల్‌కు తీసుకువస్తామని చెప్పారు. అంతకు ముందు ముథోల్‌లోని జర్నలిస్టు కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. బాసరలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపల్స్ బుచ్చయ్య, సుధాకర్, శిరీష, గ్రామాభివృద్ధికమిటీ అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోండి

నిర్మల్, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో అర్హులైన వారంతా పేర్లు నమోదు చేసుకోవాలని ఆర్డీవో రత్నకల్యాణి తెలిపారు. ఓటరు నమోదు చేసుకునేందుకు వచ్చే నెల 6 వరకు గడువు ఉందన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ఎంపీడీవో సమావేశహాలులో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో పేరు నమోదుపై మంగళవారం బీఎల్వోలకు శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ శివరాజ్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు కొత్తగా నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించాలని కోరారు. డీటీ మంజుల, బీఎల్వోలు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు తగవు

ఖానాపూర్ గ్రామీణం: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌పై వస్తున్న ఆరోపణలను మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఖండించారు. కొంత మంది ఎమ్మెల్యే మీద నిందలు, అసత్య ఆరోపణలు, అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కరిపె రాజ్ కుమార్, శివ, సంతోష్, రమేష్ పాల్గొన్నారు.

అప్పులబాధతో యువకుడి ఆత్మహత్య



సుభాష్

నేర వార్తలు

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: అప్పులు తీర్చే మార్గం లేక మనోవేదనతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని బిజ్జూర్‌లో చోటుచేసుకుంది. భైంసా గ్రామీణ ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపిన కథనం ప్రకారం గ్రామానికి చెందిన గుండేరావు సుభాష్(34) మంగళవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో ఇంటి నిర్మాణం కోసం చేసిన రూ.4 లక్షల అప్పు ఎలా తీర్చాలని రెండు రోజులుగా బెంగతో ఉన్నాడు. ఇటీవల ఇదే విషయం కుటుంబీకులతో చెబుతూ బాధపడ్డాడు. భార్య ఉదయం ఇంటి పరిసరాలు శుభ్రం చేస్తుండగా గదిలోకి వెళ్లి గడియ వేసుకున్నాడు. ఇరుగు, పొరుగు వారి సహాయంతో తలుపులు తొలగించగా అప్పటికే మృతి చెందాడన్నారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్టార్టర్ అపహరణ

కుంటాల: కుంటాల గ్రామ పంచాయతీ పల్లె ప్రకృతివనం సింగిల్‌ఫేజ్ మోటారుకు సంబంధించి స్టార్టర్ డబ్బాలోని స్టార్టర్, ఫ్యూజులు, తదితర పరికరాలు సోమవారం రాత్రి అపహరణకు గురయ్యాయి. ఆ ప్రాంతంలోని రైతు జక్కుల రమేష్ తోటలోని ఫ్యూజుల డబ్బాతోపాటు అందులోని స్టార్టర్, ఆటో స్టార్టర్, పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని బాధితులు తెలిపారు. పోలీసులకు సమాచారమిచ్చినట్లు పేర్కొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన భైంసా మండలంలోని తిమ్మాపూర్ చోటు చేసుకుంది. భైంసా గ్రామీణ ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పన్నాల రాంరెడ్డి(80) సోమవారం దిలావర్‌పూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లోంచి బయలుదేరాడు. బంధువుల ఇంటికి చేరుకోకపోగా ఎక్కడికి వెళ్లింది తెలియరాలేదు. వెతికినా ఆచూకీ లభించలేదు. బాధిత కుటుంబీకులు మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గొలుసు దొంగలకు రిమాండ్

లక్కోర(వేల్పూర్): ఓ మహిళ మెడలోంచి బంగారు గొలుసు దొంగిలించిన ఇద్దరిని వేల్పూర్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, వేల్పూర్ ఎస్సై నాగ్‌నాథ్ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ద్విచక్రవాహనంపై మెట్‌పల్లి నుంచి ఆర్మూర్ వైపు వెళ్తున్న ఇద్దరు దుండగులు వేల్పూర్ క్రాస్ రోడ్డు వద్ద ఇద్దరు మహిళలు బస్ కోసం వేచి ఉండటాన్ని గమనించారు. అందులోని ఓ మహిళ మెడలోంచి రెండున్నర తులాల బంగారం గొలుసు లాక్కుని అక్కడి నుంచి పరారయ్యారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల సాయంతో ద్విచక్రవాహనం, వారు ధరించిన దుస్తుల ఆధారంగా లక్కోర శివారులో నిందితులను పట్టుకున్నారు. నిందితులు జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌కు చెందిన షేక్ జైలద్దీన్, నిర్మల్‌కు చెందిన భూంపల్లి సంతోష్‌గా గుర్తించారు. వీరు మెట్‌పల్లిలో గొలుసు విక్రయించేందుకు వెళ్తున్నట్లు పోలీసులు తెలిపారు. గొలుసు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

అదృశ్యమైన బాలురు లభ్యం

- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



సీసీపుటేజీలో వసతిగృహం నుంచి వెళ్తున్న విద్యార్థులు

భైంసా, న్యూస్‌టుడే : భైంసా పట్టణంలోని సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలుర వసతి గృహం నుంచి మంగళవారం ఉదయం నలుగురు విద్యార్థులు అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. సీఐ గోపీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం వసతిగృహంలో సోమవారం రాత్రి కొందరు విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. దీంతో అక్కడి సిబ్బంది నచ్చజెప్పారు. సంక్షేమాధికారికి నగేశ్‌కు చెబుతారని భావించిన విద్యార్థులు ఉదయం కాలకృత్యాల సమయంలో ఆవరణలో పళ్లు తోముకుంటూ బయటపడ్డారు. అల్పాహారం, పాలు అందించే సమయంలో కుభీరు మండలం రంజని గ్రామానికి చెందిన చరణ్, ఈశ్వర్, కేశవ్, భైంసా మండలం వానల్‌పాడ్‌కు చెందిన రాకేశ్ కనబడకుండాపోయారు. ఈ విషయం తెలుసుకున్న సంక్షేమాధికారి హాస్టల్‌కు చేరుకుని తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఆరా తీశారు. తమ పిల్లలు ఇంటికి రాకపోవడంతో వసతిగృహానికి చేరుకుని సంక్షేమాధికారిను నిలదీశారు. సమాచారం అందుకున్న సీఐ గోపీనాథ్ హాస్టల్‌కు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. సీసీపుటేజీలను పరిశీలించి ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చేపట్టారు. మధ్యాహ్నం కుభీరు మండలంలోని పల్సి శివారు నుంచి రంజనీ వెళ్తున్న విద్యార్థులను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం చేరవేశారు. సీఐ, పోలీసులు వెళ్లి వారిని భైంసా పోలీసు స్టేషన్‌కు తరలించారు. జిల్లా ఎస్సీడీవో రాజేశ్వర్ గౌడ్, డీపీ ఎస్సీడీవో లత, బాలల సంరక్షణాధికారుల సమక్షంలో వారికి కౌన్సెలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

దుర్గామాత ఆలయంలో పూజలు



వానల్‌పాడ్‌లో పూజలు చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని వానల్‌పాడ్‌లోని దుర్గామాత ఆలయంలో కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి మంగళవారం పూజలు చేశారు. గ్రామస్థులు ఆలయ విశిష్ఠతలను తెలియజేశారు. అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకం, హారతి, అర్చన, తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. నాయకులు రాంకుమార్, ముత్యంరెడ్డి, ధర్మాగౌడ్, నర్సారెడ్డి, హన్మాండ్లు, పండిత్‌రావు, సోలంకి భీమ్‌రావు, గ్రామస్థులు, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

కుంటాల: మండలంలోని ఓలాలో మంగళవారం రుక్మిణి సహిత పాండురంగ విఠలేశ్వర స్వామి దేవాలయంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పండితుడు భగవాన్ జోషి ఆధ్వర్యంలో చండీహోమం, వేద మంత్రం, పుణ్యవచనం, తదితర ప్రత్యేక పూజలు చేశారు.

సంగ్రహణాత్మక పరీక్షల పరిశీలన



ఈద్గాం పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : నిర్మల్ పట్టణం ఈద్గాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి ఎ.రవీందర్‌రెడ్డి ఆకస్మికంగా మంగళవారం సందర్శించారు. సంగ్రహణాత్మక పరీక్షలు(ఎస్ఏ-1) నిర్వహణను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పర్యవేక్షించారు. జిల్లాలోని అన్ని యాజమాన్య విద్యాలయాల్లో నిర్వహిస్తున్న పరీక్షలకు పిల్లలు శతశాతం హాజరయ్యేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేకత కనబర్చాలని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియామక ఉత్తర్వుల అందజేత

నిర్మల్ అర్బన్: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి నియామక ఉత్తర్వులు అందజేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లా పాలనాధికారి అనుమతితో మొత్తం 31 ఖాళీలకు 16 పోస్టులకు అర్హత సాధించారని చెప్పారు. తొమ్మిది మంది పీజీసీఆర్టీలు, ఆరుగురు సీఆర్టీలు, యూఆర్ఎస్‌లో ఒక సీఆర్టీ ఉన్నారన్నారు. పరీక్షల సహాయ కమిషనర్ సిద్ధ పద్మ పాల్గొన్నారు.

చండీయాగం స్థలం పరిశీలన

నిర్మల్ అర్బన్: జిల్లా కేంద్రంలో నవంబరు 8 నుంచి 25 వరకు నిర్వహించనున్న శ్రీ వైష్ణవ ఆయుత చండీ యాగం విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. మంగళవారం నిర్మల్‌లో స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు.

పిల్లలకు మెరుగైన సేవలందించాలి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు మెరుగైన సేవలందించేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి సీడీపీఓ విజయగౌరి అన్నారు. పట్టణంలోని గొల్లపేట్ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు.

కుంటాల: ఆశా కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యురాలు కొరిపల్లి శ్రుతి రెడ్డి అన్నారు. కుంటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్త దినచర్యల నివేదికలను అందజేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నిర్మల్ అర్బన్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతన బకాయిలు విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జె.రాజు అన్నారు. మంగళవారం నిర్మల్‌లోని సత్యసాయి ఒకేషనల్ కళాశాలలో నిర్వహించిన సంఘ సమావేశంలో మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు సింగరి వెంకటేశ్, నాయకులు హర్షవర్ధన్, గణేశ్, కార్తిక్, రాజ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

గంగాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

కడెం: మండలంలోని గంగాపూర్‌లో మంగళవారం అసాంక్రమిక వ్యాధులపై ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డయాబెటిస్ ఉన్న ఎనిమిది మంది, బీపీతో బాధపడుతున్న 17 మందిని చికిత్స కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించారు. ఆరోగ్య విస్తరణాధికారి టి.వేణుగోపాల్, రత్న, కొమురయ్య, శశికళ, ఆశా కార్యకర్తలు చంద్రకళ, మమత, అంగన్‌వాడీ టీచర్ హరిప్రియ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఖానాపూర్ గ్రామీణం: మండలంలోని దిలావర్‌పూర్, గోసంపల్లె, గోడలపంపు, పాత ఎల్లాపూర్, కొత్తపేట్, బావాపూర్(కె) గ్రామాల్లో మంగళవారం ఎంపీవో రత్నాకర్‌రావు, మిషన్ భగీరథ ఏఈ మనోజ్‌లు పర్యటించారు. బావాపూర్(కె) గ్రామంలో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించారు. కొత్తపేట్ గ్రామంలో ఏర్పాటు చేసిన డ్రైడే అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

ఆలయ నిర్మాణానికి నిధుల మంజూరు

భైంసా: మండలంలోని కామోల్ గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రూ.8.83 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ తెలిపారు. ఈ మేరకు ఆలయ కమిటీ నాయకులు, గ్రామస్థులకు మంజూరుపత్రాలు అందించారు. త్వరలో టెండరు పిలిచి పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

రహదారి నిర్మాణానికి భూమిపూజ

నిర్మల్ పట్టణం: పట్టణంలోని వెంకటాపూర్ నుంచి నిస్సీ చర్చి తాండ వరకు నూతనంగా చేపట్టిన రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మంగళవారం భూమిపూజ చేశారు. రూ.1.20 కోట్లతో బీటీ రోడ్డు నిర్మించనున్నట్లు చెప్పారు.



ఉపకులపతి గోవర్దన్‌ను సన్మానిస్తున్న అధ్యాపక సంఘం నాయకులు

ఉపకులపతిని కలిసి.. సమస్యలు వివరించి

ముథోల్(బాసర): బాసర ఆర్జీయూకేటీ ఉపకులపతి గోవర్దన్‌ను మంగళవారం అధ్యాపక సంఘం నాయకులు కలిశారు. పలు సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. ఆ సంఘం అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి కృష్ణప్రసాద్, సహాయ కార్యదర్శులు సతీష్‌కుమార్, సాయికృష్ణ, విజయ్‌కుమార్, రమాదేవి, రాములు, వసంత్‌బాబు తదితరులున్నారు.

దస్త్రాల పరిశీలన

కుభీరు: కుభీరులోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జడ్పీ సీఈఓ గోవింద్ దస్త్రాలు పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయానికి విడుదలైన నిధులు, పీఆర్ రహదారులకు, ఉపాధిహామీలో చేపట్టిన రహదారుల దస్త్రాలు, ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. ఎంపీడీఓ నవనీత్‌కుమార్, ఎంపీఓ మోహన్‌సింగ్ ఉన్నారు.

కోతుల బెడద తగ్గించాలని వినతి



మున్సిపల్ కమిషనర్ మనోహర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖానాపూర్, న్యూస్‌టుడే: ఖానాపూర్ పట్టణంలో కోతుల బెడద ప్రమాదకరంగా మారిందని, నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆయా పార్టీలకు చెందిన నాయకులు మంగళవారం తహసీల్దార్ శివరాజ్, మున్సిపల్ కమిషనర్ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. కోతులు తరమడంతో మృతి చెందిన విద్యానగర్ కాలనీకి చెందిన బొంగోని లక్ష్మి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. బీసీ రాజన్న, కొండాడి గంగారావ్, నంది రామన్న, కొత్తపల్లి సురేష్, అనిల్‌రావు, మహేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి

కుభీరు: విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందిస్తూ ఉత్తములుగా తీర్చిదిద్దాలని ఎంఈఓ విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం కుభీరులోని ఉర్దూ పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టిక పరిశీలించారు. విద్యార్థులతో ఎక్కాలు, ఆంగ్ల పాఠ్యపుస్తకంలోని ఓ పాఠం చదివించారు.

సోన్: ఎస్-1 పరీక్షల్లో శతశాతం హాజరుశాతం ఉండాలని సోన్ ఎంఈఓ తొడిశెట్టి పరమేశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని న్యావెల్మల్, బొప్పారంలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు.

కుంటాల, న్యూస్‌టుడే: పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ వాటోలి ముత్యం అన్నారు. మండలంలోని కల్లూరు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎస్ఏ-1 పరీక్షలను పర్యవేక్షించారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రావు, ఉపాధ్యాయుడు నవీన్, తదితరులు, పాల్గొన్నారు.

సారంగాపూర్: కళాశాలకు వచ్చే విద్యార్థుల హాజరుశాతం మెరుగుపడాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి జె.పరుశురాం అన్నారు. మంగళవారం సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. సైన్స్ విద్యార్థులకు ఏపీసెట్, ప్రయోగ తరగతులు నిర్వహించాలని సూచించారు. ప్రిన్సిపల్ శంకర్, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

మామడ, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మామడలో పర్యటించారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఇంటి పన్ను బకాయిలు వసూలు చేయాలని చెప్పారు. సెగ్రిగేషన్ షెడ్‌లలో ఎరువు తయారీపై దృష్టి సారించాలన్నారు. ఎంపీడీవో గంగాసాగర్‌రెడ్డి, పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు.